సాక్షి
రాజన్న సిరిసిల్ల

శనివారం । 5 । ఆగస్టు । 2023



మిడ్‌మానేరుకు వరద

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరులోకి శుక్రవారం 1,200 క్యూసెక్కుల నీరు వస్తుండగా, ఇక్కడి నుంచి ఎల్‌ఎండీకి 1,536 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.



పోలింగ్‌బూత్‌ల పరిశీలన

తంగళ్లపల్లి(సిరిసిల్ల): పోలింగ్‌బూత్‌ల ఏర్పాటుకు సిరిసిల్ల ఆర్డీవో ఆనంద్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. జీపీ ఆఫీస్, ప్రభుత్వ స్కూల్, ఎంపీడీవో ఆఫీస్‌ను పరిశీలించారు.

గరిష్టం/కనిష్టం
33.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. బలమైన ఈదురుగాలులు వీస్తాయి.

పగార్లకు పైసల్లేవు !

ఇవీ సర్కారు బకాయిల వివరాలు

2021-2022

బతుకమ్మ చీరలు	: రూ.9.20కోట్లు
క్రిస్మస్ వస్త్రాలు	: రూ.1.11కోట్లు
వెల్ఫేర్ వస్త్రాలు	: రూ.0.68కోట్లు
మొత్తం	: రూ. 10.99కోట్లు

2022-2023

బతుకమ్మ చీరలు	: రూ.14.77కోట్లు
యూనిఫామ్స్	: రూ.6.47కోట్లు
రంజాన్ వస్త్రాలు	: రూ.3.69కోట్లు
క్రిస్మస్ వస్త్రాలు	: రూ.1.52కోట్లు
జాతీయ జెండాలు	: రూ.0.72కోట్లు
కేసీఆర్ కిట్ల చీరలు	: రూ.1.08కోట్లు
మొత్తం	: రూ.28.25కోట్లు

2023-2024

యూనిఫామ్స్	: రూ.44.50కోట్లు
రంజాన్ వస్త్రాలు	: రూ.25.37కోట్లు
వెల్ఫేర్ వస్త్రాలు	: రూ.1.64కోట్లు
మొత్తం	: రూ.71.51కోట్లు

- సర్కారు వస్త్రోత్పత్తి ఆర్డర్లతో అప్పులపాలు
- 2021 నుంచి పేరుకుపోయిన బకాయిలు
- సిరిసిల్ల నేతన్నలకు రూ.110.75 కోట్ల బకాయిలు
- కార్మికులకు ప్రతీ వారం చెల్లింపులు
- బంగారం, ఆస్తులు కుదువబెట్టి అప్పులు తెస్తున్న వస్త్రోత్పత్తిదారులు
- వడ్డీ రేట్లు పెంచిన నూలు వ్యాపారులు
- బతుకమ్మ చీరల నుంచి జాతీయ జెండాల దాకా అన్నీ పెండింగే



సిరిసిల్ల: 'సిరిసిల్లలోని వెంకంపేటకు చెందిన ఓ వస్త్రోత్పదారుని వద్ద 36 సాంచాలు ఉన్నాయి. పది మంది కార్మికులు పనిచేస్తున్నారు. 2021లో జౌళిశాఖ ఇచ్చిన 2 లక్షల మీటర్ల బతుకమ్మ చీరల బట్ట ఉత్పత్తి ఆర్డర్లను అదే సంవత్సరం సెప్టెంబర్‌లోనే అందించాడు. ఆ బట్ట బిల్లులు రూ.48 లక్షలు పెండింగ్‌లోనే ఉన్నాయి. 2022లో మళ్లీ బతుకమ్మ చీరల బట్ట ఆర్డర్లను పొంది, సకాలంలోనే అందించినప్పటికీ మరో రూ.66 లక్షలు రావాల్సి ఉంది. ఇప్పటికే రెండేళ్ల బిల్లులు పెండింగ్‌లో ఉండగా మళ్లీ ఇప్పుడు బతుకమ్మ చీరల ఆర్డర్లు పొందాడు. ఒక్క ఇతనికే ప్రభుత్వం నుంచి రూ.1.14 కోట్ల పాత బిల్లులు, మళ్లీ ఇప్పుడు ఉత్పత్తి చేస్తున్న బట్ట బిల్లులు రావాల్సి ఉంది. పెట్టుబడికి డబ్బులు లేక తెలిసిన వారి వద్ద అప్పులు చేయడంతోపాటు ఇంట్లోని బంగారం బ్యాంకులో తాకట్టు పెట్టాడు.' ఇది సిరిసిల్లలో ఒక్కరిద్దరి పరిస్థితి కాదు.. వందలాది మంది వస్త్రోత్పత్తిదారుల దుస్థితి.

అసలు ఏం జరుగుతుందంటే..

సిరిసిల్లలో సాంచాల మధ్య పనిచేసే కార్మికులకు ప్రతి ఆదివారం పగార్(కూలీ డబ్బులు) చెల్లించాలి. కొందరు వస్త్రోత్పత్తిదారులు 15 రోజులకోసారి ఇస్తారు. ఒక్కో కార్మికుడు వారం రోజుల్లో నేసిన(ఉత్పత్తి చేసిన) బట్ట ఆధారంగా రూ.3,500 నుంచి రూ.4 వేల వరకు సంపాదిస్తారు. ప్రభుత్వం ఆర్డర్ చేసిన బతుకమ్మచీరలు, సర్వశిక్షా అభియాన్ (స్కూల్ యూనిఫామ్స్), కేసీఆర్ కిట్లు, రంజాన్, క్రిస్మస్, వెల్ఫేర్‌శాఖల బట్టల బిల్లులు ఏళ్లుగా పెండింగ్‌లో ఉంటున్నాయి. కానీ సిరిసిల్ల వస్త్రోత్పత్తిదారులు తమ వద్ద పనిచేసే కార్మికులకు ప్రతీ వారం పగార్లు చెల్లించేందుకు అప్పులు చేస్తున్నారు. ఒక్క ఏడాది రాకుంటే సర్దుబాటు చేసుకోవచ్చు.. కానీ మూడేళ్లుగా ఇలాగే అటు బిల్లులు రాక.. ఇటు ప్రతీ వారం చెల్లింపులతో వస్త్రోత్పత్తిదారుల ఇబ్బంది పడుతున్నారు.

వడ్డీ రేట్లు పెంచిన నూలు వ్యాపారులు

సిరిసిల్ల మొత్తం వస్త్రపరిశ్రమకు హైదరాబాద్‌కు చెందిన నలుగురు వ్యాపారులు నూలు సరఫరా చేస్తారు. వస్త్రోత్పత్తిదారులకు అవసరమైన నూలును వందశాతం పేమెంట్ చేస్తే వెంటనే లారీల్లో నూలు వస్తుంది. ఆర్థికంగా స్తోమత లేని వారికి గతంలో 18 శాతం వడ్డీతో(నూటికి నెలకు రూ.1.50) అరువుపై ఇచ్చే వారు. ఈ ఏడాది ఆ వడ్డీ రేట్లను 24 శాతానికి పెంచారు. సిరిసిల్లలో 80 శాతం వస్త్రోత్పత్తిదారులు అరువుపైనే నూలు దిగుమతి చేసుకుంటున్నారు. మూడేళ్లుగా పేమెంట్లు పెండింగ్‌లో ఉండడంతో వస్త్రోత్పత్తిదారులు చెల్లించాల్సిన నూలు డబ్బుల వడ్డీలు పెరిగిపోయాయి.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం



సిరిసిల్ల వస్త్రోత్పత్తిదారులకు రావాల్సిన బకాయిల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లాం. దశలవారీగా పెండింగ్ బిల్లులు మంజూరవుతాయి. త్వరలోనే పెండింగ్ బిల్లులు మంజూరవుతాయని భావిస్తున్నాం.

– గూడూరి ప్రవీణ్, టీపీటీడీసీ చైర్మన్

రూ.110.75 కోట్ల బకాయిలు

గత మూడేళ్లుగా ప్రభుత్వం ద్వారా సిరిసిల్ల నేతన్నలకు రూ.110.75 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. ఈ ఏడాది మళ్లీ బతుకమ్మ చీరల బట్ట కొనుగోళ్లు ప్రారంభించారు. అంటే ఈ ఏడాదికి సంబంధించిన బిల్లులు కూడా ఇవ్వాల్సి ఉంది. 2021 నుంచి జౌళిశాఖ సేకరించిన బట్టకు సంబంధించి 10 శాతం, 20 శాతం, 100 శాతం బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. గతేడాది ఆగమేఘాలపై జాతీయ జెండాల(హర్ ఘర్ తిరంగా) బట్టను సేకరించగా.. ఆ బిల్లుల కూడా ఇవ్వలేదు.

మంత్రి కేటీఆర్‌పైనే ఆశలు

సిరిసిల్ల నేతకార్మికులకు మెరుగైన ఉపాధి కల్పించే లక్ష్యంతో బతుకమ్మచీరలు, ప్రభుత్వ వస్త్రోత్పత్తి ఆర్డర్లు సిరిసిల్ల వస్త్రపరిశ్రమకు అందుతున్నాయి. మూడేళ్లుగా వస్త్రోత్పత్తిదారులకు రూ.110.75 కోట్లతో పెండింగ్ ఉన్న విషయాన్ని సిరిసిల్ల నేతన్నలు మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్తున్నారు. మంత్రి కేటీఆర్ చొరవతో బకాయిలు మంజూరవుతున్నా జౌళిశాఖ ఉన్నతాధికారులు ఆ డబ్బులను ఇతర రంగాలకు మళ్లిస్తున్నారు. దీంతో సిరిసిల్ల నేతన్నలకు పూర్తి స్థాయిలో బిల్లుల రావడం లేదు.

న్యూస్‌రీల్

సిబ్బంది సంక్షేమానికి చర్యలు



హోంగార్డులకు షూస్ అందిస్తున్న ఎస్పీ

సిరిసిల్లక్రైం: జిల్లాలో పనిచేస్తున్న పోలీసు, హోంగార్డుల సంక్షేమానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. జిల్లాలో పనిచేస్తున్న 160 హోమ్‌గార్డ్స్‌కు బూట్లను శుక్రవారం అందించారు. సిబ్బంది ఆరోగ్యం దృష్ట్యా హెల్త్‌క్యాంపులు, యోగా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విధి నిర్వహణతోపాటు ఆరోగ్యంగా ఉండడం ముఖ్యమన్నారు. బందోబస్తు విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆర్‌ఐ యాదగిరి, హెడ్‌కానిస్టేబుల్ రవీందర్, హోమ్‌గార్డ్స్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



తుర్కపల్లిలో మాట్లాడుతున్న డీపీవో

ముస్తాబాద్(సిరిసిల్ల): పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని జిల్లా పంచాయతీ అధికారి రవీందర్ పేర్కొన్నారు. మండలంలోని తుర్కపల్లిలో శుక్రవారం చేపట్టిన డ్రై డేను పరిశీలించారు. డీపీవో మాట్లాడుతూ మొక్కుబడిగా కాకుండా ప్రభుత్వ ఉద్యోగులందరూ పనిచేయాలని సూచించారు. పంచాయతీ కార్మికులు సమ్మెలో ఉన్నందునా వీధుల్లో చెత్త పడవేయకుండా గ్రామస్తులను చైతన్యవంతం చేయాలన్నారు. వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఐకేపీ ఉద్యోగులు కలిసికట్టుగా పనిచేసి అనవసర నీటి నిల్వలను గుర్తించి తొలగించాలని తెలిపారు. సర్పంచ్ కాశోల్ల పద్మ, కార్యదర్శి శ్రీనివాస్, సీసీ లీలారాణి, అంగన్‌వాడీ టీచర్ బాల్‌లక్ష్మి, వీవోఏ జమున, దుర్గప్రసాద్ ఉన్నారు.

విద్యాప్రమాణాలు పెంపొందించాలి



మాట్లాడుతున్న రమేశ్‌కుమార్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీస్తూ.. వారిలో విద్యాప్రమాణాలను పెంపొందించాలని జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ కోరారు. ఎల్లారెడ్డిపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న కంప్యూటర్ చాంప్స్‌ను శుక్రవారం పరిశీలించారు. 9వ తరగతి విద్యార్థులకు కంప్యూటర్‌పై పలు ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. డీఈవో మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు గణిత కార్యక్రమాన్ని విజయవంతంగా కొనసాగించాలన్నారు. ప్రతి విద్యార్థి ప్రమాణాలను అందుకునే విధంగా పునాది అక్షరాస్యత సంఖ్యాభావన కొనసాగించాలని సూచించారు. వెంకటాపూర్‌లోని జెడ్పీ హైస్కూల్‌ను డీఈవో సందర్శించారు. అక్కడ నిర్వహిస్తునన పాఠ్య, సహపాఠ్య కార్యక్రమాలను, కంప్యూటర్‌చాంప్స్‌ను పరిశీలించారు. కో–ఆర్డినేటర్ శైలజ, ఎంఈవో దూస రఘుపతి, కోర్సు డైరెక్టర్ మద్దికుంట లక్ష్మణ్, హెచ్‌ఎం హన్మండ్లు పాల్గొన్నారు.

ఆయుర్వేదంపై అవగాహన పెంచుకోవాలి



మొక్కలు నాటుతున్న ఆడెపు రవీందర్, లాల జ్యోతి

సిరిసిల్ల: ఆయుర్వేదంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సిరిసిల్ల మున్సిపల్ మాజీ చైర్మన్, యోగా గురువు ఆడెపు రవీందర్ కోరారు. పతంజలి యోగాపీఠం అధినేత ఆచార్య బాలకృష్ణ గురూజీ 51వ జన్మదినం సందర్భంగా శుక్రవారం వేములవాడ అర్బన్ మండలం కమాన్ వద్ద కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఆయుర్వేద మొక్కలను నాటి, పిల్లలకు పంపిణీ చేశారు. రవీందర్ మాట్లాడుతూ ఆయుర్వేద మొక్కలను ఇంటి ముందు, పెరటిలో పెంచుకుంటే మంచిదన్నారు. పిల్లలకు తిప్పతీగ, నేల ఉసిరి, కలబంద, కుప్పింట, జామ, అల్లనేరేడు మొక్కలు పంపిణీ చేశారు. వేములవాడ యోగా గురువు లాలజ్యోతి, స్కూల్ కరస్పాండెంట్, పిల్లలు పాల్గొన్నారు.

రూ.2.50కోట్లు డ్రెయినేజీ పాలు

- నిరుపయోగంగా వాటర్ ట్రీట్‌మెంట్ ప్రాజెక్టు
- నిర్మాణంలో లోపాలు, నిర్వహణలో వైఫల్యాలు
- చిన్న వర్షానికే రోడ్లపైకి వస్తున్న మురుగునీరు
- పద్మనగర్‌వాసులకు తప్పని కష్టాలు



వరదల్లో కొట్టుకొచ్చిన సిల్ట్



లోప భూయిష్టమైన వాటర్ ట్రీట్‌మెంట్ ప్రాజెక్టు

సిరిసిల్లకల్చరల్: ప్రణాళిక లేని నిర్మాణాలతో సిరిసిల్ల వాసుల కష్టాలు రెట్టింపు అయ్యాయి. నిర్మాణాలతో పరిష్కారం కావాల్సిన సమస్యలు ఎక్కువయ్యాయి. ప్లానింగ్, డిజైనింగ్ లోపంతో జిల్లా కేంద్రంలోని పద్మనగర్‌లో నిర్మించిన వాటర్‌ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిరుపయోగంగా మారింది. రూ.2.50 కోట్లు డ్రెయినేజీలో పోసినట్లు అయ్యింది. అధికారుల అలసత్వం, పాలకుల నిర్లక్ష్యంతో 38వ డివిజన్ ప్రజలు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు.

పేరుకుపోయిన సిల్ట్

- జిల్లా కేంద్రంలోని పద్మనగర్‌లో ప్రధాన మురికి కాలువలో సిల్ట్ నిండిపోయి.. మురికినీరు ముందుకు కదలడం లేదు.
- దుర్వాసన వస్తుండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.
- శాశ్వత పరిష్కారం కోసం నాలుగేళ్ల క్రితం ఎర్త్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు.
- రూ.1.95 కోట్లు పనులకు, మరో రూ.75 లక్షలు నిర్వహణకు వెచ్చించారు. 0.5 మిలియన్ లక్షల మురికినీటిని శుద్ధి చేసే లక్ష్యంగా దీన్ని నిర్మించారు.
- లక్ష్యం నెరవేరకపోగా వేగంగా వచ్చే వరద నీటి ప్రవాహానికి స్పీడ్ బ్రేకర్‌గా నిలుస్తుంది.
- కాలువ కన్నా ప్రాజెక్టు ఎత్తుగా నిర్మించడంతో నీళ్లు పైకి ఎగబాకుతున్నాయి.
- కాలువకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లు నిర్మించాలన్న ప్రతిపాదనను కాంట్రాక్టర్ పట్టించుకోలేదు.

అన్నీ లోపాలే..

వాటర్‌ట్రీట్‌మెంట్ ప్రాజెక్టు నిర్మాణంలో అన్నీ లోపాలే కనిపిస్తున్నాయి. 0.5 మిలియన్ లీటర్ల నీటిని శుద్ధి చేసేందుకు దీన్ని నిర్మించారు. కాలువకు పైన బోనాల, చంద్రంపేట, ముష్టిపల్లి ప్రాంతాల్లోని చెరువులు అనుసంధానమై ఉన్నాయి. వర్షాకాలంలో వరదనీరు ఇటువైపే వస్తుంది. ఆ వరదకు ఈ ప్రాజెక్టు అడ్డుగా మారడంతో పద్మనగర్, అశోక్‌నగర్, అనంతనగర్, సర్దార్‌నగర్ సంజీవయ్యనగర్, పాతబస్టాండ్ ప్రాంతాలు జలమయమవుతున్నాయి.

ప్రాజెక్టుతోనే అవస్థలు



ప్రాజెక్టు డిజైనింగే అవగాహన లోపంతో చేశారు. పైన ప్రాంతంలో చెరువులు ఉన్నాయని విషయాన్ని దృష్టిలో పెట్టుకోలేదు. ఈ విషయాన్ని మున్సిపల్ కౌన్సిల్‌కు వివరించినా ఫలితం లేదు. అధికారులతో ప్రస్తావించినా చలనం లేదు. కాంట్రాక్టర్లు, అధికారుల మధ్య సమన్వయ లోపంతో ఇబ్బందులు పడుతున్నాం. ఇక్కడి నుంచి ప్రాజెక్టును తొలగించి మరో ప్రాంతంలో నిర్మిస్తేనే సమస్య పరిష్కారం అవుతుంది.

– గూడూరి భాస్కర్, స్థానిక కౌన్సిలర్

మూడు రోజులు నరకం



వర్షాలు, వరదల సమయంలో మా ఇంట్లోకి అడుగున్నర ఎత్తులో నీళ్లు వచ్చాయి. మూడేళ్లుగా ఏటా వర్షాకాలంలో ఇదే పరిస్థితి. మొన్నటి వరదల సమయంలో మూడు రోజులపాటు నీళ్లలోనే ఉండాల్సి వచ్చింది. విధిలేని పరిస్థితుల్లో మా కూతురు ఇంట్లో తలదాచుకున్నాం. ఇప్పటికైనా కాలువ ద్వారా వరదనీరు నేరుగా వెళ్లిపోయేలా అక్కడ అవసరమైన ఏర్పాట్లు చేయాలి.

– గుర్రం కనకయ్య, సుగుణ దంపతులు

గతంలో చెరువు తెగినా సమస్య రాలేదు



బోనాల చెరువు కట్ట తెగిపోవడం కొత్తదేమీ కాదు. సుమారు 35 ఏండ్ల క్రితం కూడా కట్ట తెగింది. అప్పుడు ఎలాంటి సమస్య రాలేదు. రెండేళ్ల క్రితం, ఇప్పుడు చెరువుకు గండి పడింది. వేగంగా వచ్చే వరద నీరు వెళ్లకుండా ప్రాజెక్టు నిర్మాణంతో కాలువ ఇరుకుగా మారింది. ప్రాజెక్టు నిర్మాణంలో లోపంతోనే మురుగునీరు రోడ్లపైకి వస్తోంది.

– భూపతిరావు, కాలనీవాసి

పార్టీ సిద్ధాంతాలు నచ్చే చేరికలు

- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్



కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులకు కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఆది శ్రీనివాస్

రుద్రంగి(వేములవాడ): కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు నచ్చే పలువురు నాయకులు పార్టీలో చేరుతున్నారని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. రుద్రంగిలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా పార్టీలో చేరిన రిక్కల భూమారెడ్డి, దుబ్బ చిన్నారెడ్డి, ఆవునూరి లక్ష్మణ్‌లకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలపై కాకుండా ఓట్లు, సీట్ల రాజకీయం చేస్తుందని విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. నాయకులు తూము జలపతి, సామ మోహన్‌రెడ్డి, తర్రె మనోహర్, చెలుకల తిరుపతి, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, పల్లి గంగాధర్, గండి నారాయణ, ధర్న మల్లేశం పాల్గొన్నారు.

రాజన్న సేవలో వీటీడీఏ కార్యదర్శి సమ్మయ్య



వేములవాడ: రాజన్నను వీటీడీఏ కార్యదర్శిగా నియమితులైన సమ్మయ్య శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు రాజు, పర్యవేక్షకుడు అల్లి శంకర్ ప్రసాదాలు అందించారు.

తండ్రి జ్ఞాపకార్థం పురస్కారాలు అభినందనీయం

- టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్
- నాగుల మల్లయ్య స్మారక పురస్కారాలు ప్రదానం
- మురళీధర్‌రావు, సుకుమార్‌రెడ్డిలకు అందజేత



రిటైర్డు ఎస్పీ మురళీధర్‌రావును సన్మానిస్తున్న స్థానిక ప్రజాప్రతినిధులు

సిరిసిల్ల: తండ్రి జ్ఞాపకార్థం పురస్కారాలు ఇవ్వడం అభినందనీయమని తెలంగాణ పవర్‌లూమ్, టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్ పేర్కొన్నారు. సిరిసిల్లలోని రేణుక ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నాగుల మల్లయ్య 36వ స్మారక పురస్కారాన్ని రిటైర్డు ఎస్పీలు మురళీధర్‌రావు, సుకుమార్‌రెడ్డిలకు అందించారు. ప్రవీణ్ మాట్లాడుతూ కళాకారుడిగా, సామాజిక సేవకుడిగా నాగుల మల్లయ్య గుర్తింపు పొందారన్నారు. సిరిసిల్ల కవులు, కళాకారుల ఖిల్లాగా భాసిల్లుతోందని పేర్కొన్నారు. తండ్రి యాదిలో మల్లయ్య కుమారుడు సత్యనారాయణగౌడ్, మనవడు సంతోష్‌గౌడ్‌లు ఏటా పురస్కారాలు ప్రదానం చేయడం అభినందనీయమన్నారు. సిరిసిల్ల ప్రాంతంలో డీఎస్పీగా, సీఐగా, ఎస్సైగా సేవలందించిన మురళీధర్‌రావు, సీఐగా సేవలందించిన సుకుమార్‌రెడ్డిలకు పురస్కారాలు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి మాట్లాడుతూ 36 ఏళ్లుగా తండ్రి జ్ఞాపకార్థం పురస్కారాలు అందించడం గొప్ప విషయమన్నారు. సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, గౌడ సంఘం నాయకులు బుర్ర నారాయణగౌడ్, జగన్‌గౌడ్, చిట్టిబాబు, గుడ్ల రవి, ముత్యంరెడ్డి, కరుణాకర్‌రావు, విఠల్‌రెడ్డి, అన్నల్‌దాస్ అనిల్‌కుమార్, కొండ శ్రీనివాస్, అవార్డు కమిటీ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, కన్వీనర్ నాగుల సంతోష్‌గౌడ్, కో–కన్వీనర్ ఎండీ సలీం, మున్సిపల్ కౌన్సిలర్ యెల్లండి దేవదాస్ పాల్గొన్నారు.

మురళీధర్‌రావును సన్మానించిన క్రీడాకారులు

సిరిసిల్ల టౌన్‌క్లబ్‌లో ఇండోర్ కోర్టు నిర్మాణాన్ని చేపట్టిన రిటైర్డు ఎస్పీ మురళీధర్‌రావును క్రీడాకారులు సన్మానించారు. మురళీధర్‌రావు మాట్లాడుతూ తాను 23 ఏళ్ల కిందట పనిచేసిన చోట ఇలా సన్మానం పొందడం ఆనందంగా ఉందన్నారు. ఆత్మీయంగా పిలిచి సత్కరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

'డబుల్' కాలనీల్లో వసతులు కల్పించండి

- జిల్లాలో పది పోలింగ్ కేంద్రాల పెంపు
- ఈవీఎంలపై అవగాహన కల్పించాలి
- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్



అధికారులతో సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల: జిల్లాలో నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్ ఇంజినీర్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సాయంత్రం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై సమీక్షించారు. జిల్లాలో 3,514 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పూర్తయ్యాయని, ఆ కాలనీల్లో వసతులు కల్పించి, లబ్ధిదారుల పంపిణీకి సిద్ధం చేయాలని సూచించారు. జిల్లాలోని 997 మంది లబ్ధిదారులకు సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలకు అనుమతి ఇచ్చామని, వాటిని వేగంగా పూర్తి చేయాలన్నారు. ఆ ఇళ్లకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని సూచించారు. పీఆర్ ఈఈ సూర్యప్రకాశ్, హౌసింగ్ ఇన్‌చార్జి భాస్కర్, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్, సోషల్ వెల్ఫేర్ శాఖల డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

అదనంగా పది పోలింగ్ కేంద్రాలు

జిల్లాలో అదనంగా పది పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాలని జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ కోరారు. కలెక్టరేట్‌లో ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షించారు. సిరిసిల్ల నియోజకవర్గంలో 147 ప్రాంతాల్లో 282 పోలింగ్ కేంద్రాలు ఉండగా..అదనంగా మరో ఐదు కేంద్రాలకు ప్రతిపాదనలు ఇవ్వాలన్నారు. వేములవాడ నియోజకవర్గంలో 141 ప్రాంతాల్లో 255 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఇక్కడ కూడా అదనంగా మరో ఐదు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. 1,350 ఓట్ల కంటే ఎక్కువ ఉంటే మరో కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. ఈవీఎంలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఓటర్ల నమోదుపై ప్రచారం చేయాలన్నారు. సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు ఆనంద్‌కుమార్, పి.మధుసూదన్, కలెక్టరేట్‌లో ఏవో విజయ్‌కుమార్, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్లు అబ్దుల్ రహమాన్, పాషా తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన మున్సిపల్ కమిషనర్ ఆయాజ్



కమిషనర్‌ను సన్మానిస్తున్న చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

సిరిసిల్లటౌన్: పదోన్నతిపై కోరుట్ల నుంచి సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్‌గా వచ్చిన మహమ్మద్ ఆయాజ్ శుక్రవారం విధుల్లో చేరారు. చైర్‌పర్సన్ జిందం కళ, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్లు, సిబ్బంది ఆహ్వానం పలికారు. చైర్‌పర్సన్ చాంబర్‌లో కొత్త కమిషనర్ ఆయాజ్‌తోపాటు ఇప్పటి వరకు కమిషనర్‌గా విధులు నిర్వర్తించిన వెల్దండి సమ్మయ్యలను సన్మానించారు. మున్సిపల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కమిషనర్ ఆయాజ్‌ను సత్కరించారు. గాజుల వేణు, ఎర్రం విజయ్, సయ్యద్ అక్రం, పాటి కుమార్‌రాజు, మున్సిపల్ ఈఈ ప్రసాద్, ఏఈ నరసింహస్వామి, వెంకటేశ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి



చెక్కులు అందజేస్తున్న తిరుపతిరెడ్డి

వేములవాడరూరల్: బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి కోరారు. వేములవాడ సొసైటీ నుంచి 13 మంది రైతులకు రూ.56 లక్షల రుణాలను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ రైతుల కోసమే పీఏసీఎస్ పనిచేస్తుందన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఇంటి ఆవరణను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి

ఇల్లంతకుంట(మానకొండూర్): ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు సూచించారు. మండలంలోని పొత్తూరులో శుక్రవారం డ్రైడేను పరిశీలించారు. ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని వైద్యసిబ్బందికి సూచించారు. గ్రామాల్లో జ్వరాలు ప్రబలితే వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్లకల్చరల్: జిల్లాలో ప్రభుత్వ, జిల్లాపరిషత్, తెలంగాణ కేజీబీవీ, మోడల్ పాఠశాలల్లో తాత్కాలిక పద్ధతిన కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుల భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. డిగ్రీ, పీజీ, కంప్యూటర్ డిగ్రీ, ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు అర్హులని, సీ–లాంగ్వేజ్, హెచ్‌టీఎంఎల్ కోర్సులు చేసిన వారికి నియామకాల్లో ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. అర్హులు ఈనెల 7లోపు డీఈవో ఆఫీస్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ముగ్గురి అరెస్టు

గంభీరావుపేట(సిరిసిల్ల): పాతకేసులలో కోర్టుకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్న ముగ్గురిపై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ కాగా శుక్రవారం కోర్టులో హాజరుపర్చినట్లు గంభీరావుపేట ఎస్సై మహేశ్ తెలిపారు. మండలంలోని గాదం లచ్చయ్య, గాదం దేవేంద్ర, గాదం సత్తవ్వలను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా.. జడ్జి ఆదేశాలతో కరీంనగర్ జైలుకు తరలించినట్లు వివరించారు.

జీపీ రికార్డులు స్వాధీనం

ఇల్లంతకుంట(మానకొండూర్): మండలంలోని గాలిపల్లి గ్రామపంచాయతీలో నిధుల దుర్వినియోగం జరిగిందని గ్రామస్తులు గత నెలలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈమేరకు డీఎల్పీవో ప్రదీప్‌కుమార్ శుక్రవారం గ్రామపంచాయతీలోని రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. గ్రామసభ ఏర్పాటు చేసి, నిధుల దుర్వియోగంపై ప్రజల సమక్షంలో విచారణ చేపడతామని తెలిపారు.

దర్జాగా.. కాల్వల కబ్జా



ఇటీవలి భారీ వర్షాలకు వేములవాడ శివారులోని మల్లారం రోడ్డులో కట్టు కాల్వ ఉప్పొంగి ప్రవహించింది. వరద నీరు ఇళ్లలోకి చేరింది. స్థానికులు వర్షాలు తగ్గేవరకు బిక్కుబిక్కుమంటూ గడిపారు. ఏటా వానాకాలంలో ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నామని ఇళ్ల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తిప్పాపూర్‌లోని సవరాల కాలనీ కాలువదీ ఇదే పరిస్థితి.



మల్లారం రోడ్డులో కట్టు కాల్వ పక్కన నిర్మాణాలు

- ఎక్కడికక్కడ కొనసాగుతున్న నిర్మాణాలు
- ఇరుకుగా మారిన కాల్వలు
- వర్షాలు పడితే ఇళ్లు, పంటలను ముంచెత్తుతున్న వరద
- బఫర్ జోన్‌ను కాపాడాలని ఆదేశాలున్నా చర్యలేవి?
- వేములవాడలో పరిస్థితి

వేములవాడ: కబ్జాకు కాదేదీ అనర్హం అన్నట్లుగా ఉంది వేములవాడలోని పలువురు రియల్టర్ల వ్యవహారం. వేములవాడ మున్సిపల్ పరిధిలోని కోనాయపల్లి నుంచి ప్రారంభమయ్యే కట్టు కాల్వ వేములవాడలోని మంచినీటి బావి ప్రాంతంలో మూలవాగులో కలుస్తుంది. ఇలా దీని ప్రయాణం 5 కిలోమీటర్ల పైనే ఉంటుంది. ఈ క్రమంలో వేములవాడ శివారు మల్లారం రోడ్డులోని కాల్వను ఆనుకొని ఉన్న భూముల యజమానులు, రియల్టర్లు తమ పలుకుబడిని ఉపయోగించి, కాల్వను దర్జాగా కబ్జా చేస్తూ నిర్మాణాలు చేపడుతున్నారు. ఫలితంగా కట్టు కాల్వ ఇరుకుగా మారింది. భారీ వర్షాలు కురిసినప్పుడు వరద నీరు సమీప ఇళ్లను ముంచెత్తుతోంది. పంటలూ మునిగిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాల్వ పక్కనే 150కి పైగా ప్లాట్లు

కట్టు కాల్వ సమీపంలోని భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో స్థానిక భూయజమానులు, పలువురు రియల్టర్లు కాల్వ స్థలాన్ని కబ్జా చేస్తున్నారు. ఇక్కడ 150కి పైగా ప్లాట్లు వెలిశాయి. ఇంత జరుగుతున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. కట్టు కాల్వ స్థలాన్ని రక్షించాల్సిన కోరుతున్నారు. వేములవాడ మున్సిపల్ పరిధిలో బఫర్ జోన్‌ను కాపాడాలని వేములవాడ, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్లను ఉన్నతాధికారులు గతంలోనే ఆదేశించారు. కానీ ఆ దిశగా చర్యలు తీసుకోలేదన్న విమర్శలున్నాయి.

నిబంధనలు పాటించకుంటే కూల్చేస్తాం

మల్లారం రోడ్డులోని కట్టు కాల్వను ఆనుకొని 8 ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. వీటిలో ఏడింటికి అనుమతులిచ్చాం. కాల్వలు కబ్జాకు గురవకుండా చర్యలు తీసుకుంటాం. బఫర్ జోన్ పరిధి దాటి, నిర్మాణాలు చేపట్టాలని సూచించాం. ఒక ఇంటి నిర్మాణం నిలిపివేశాం. ఇప్పటికే రెండు సార్లు నోటీసులిచ్చాం. నిబంధనలు పాటించకుండా నిర్మాణాలు చేపడితే కూల్చేస్తాం.

– అన్వేష్, మున్సిపల్ కమిషనర్, వేములవాడ

ఈత చెట్లతో గీత కార్మికులకు ఉపాధి



మొక్కలు నాటుతున్న అధికారులు, కార్మికులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఈత చెట్లతో గీత కార్మికులకు ఉపాధి లభిస్తుందని ఎక్సైజ్ సీఐ ఎంపీఆర్ చంద్రశేఖర్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని నారాయణపూర్‌లో శుక్రవారం గీత కార్మికులతో కలిసి 3,500 ఈత మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉచితంగా ఈత మొక్కలు అందిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని గీత కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నాటిన మొక్కలు ఏపుగా పెరిగే వరకు కాపాడుకుంటే మంచి ఫలితాలు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది, గీత కార్మికులు శ్రీనివాస్, లింగాల యాదగిరి, రమేశ్, లింగాల అంజయ్య, బొల్గం రంగయ్య, గోవర్దన్, లింగాల లక్ష్మీనారాయణ, పాముల స్వామి, లింగాల నరేందర్, నారాయణ, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో అన్నాతమ్ముడికి గాయాలు



ఆస్పత్రికి తరలిస్తున్న హెడ్‌కానిస్టేబుల్, నాయకులు

ఇల్లంతకుంట(మానకొండూర్): రోడ్డు ప్రమాదంలో అన్నాతమ్ముడు గాయపడ్డారు. బాధితుల వివరాల ప్రకారం.. ఇల్లంతకుంట మండల కేంద్రానికి చెందిన కొండికొప్పుల బాబు, హెచెందర్ సోదరులు. శుక్రవారం బైక్‌పై బెజ్జంకి మండలం బేగంపేటలోని తమ సోదరి ఇంటికి వెళ్తున్నారు. తాళ్లపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. బాధితులు తమను ఆటో ఢీకొట్టిందని చెబుతున్నారు. బాబు తలకు తీవ్ర గాయం కాగా, హెచెందర్ కాలు విరిగింది. హెడ్ కానిస్టేబుల్ భూమయ్య, కాంగ్రెస్ నాయకులు వినయ్‌కుమార్, పాశం రాజేందర్ రెడ్డిలు సంఘటనా స్థలానికి చేరుకొని, బాధితులను అంబులెన్స్‌లో సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

బీసీ డిగ్రీ గురుకులంలో ప్రవేశాలు

సిరిసిల్లటౌన్: ఎల్లారెడ్డిపేటలోని బీసీ బాలుర డిగ్రీ గురుకుల కళాశాలలో విద్యార్థుల ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.వీరప్రభాకర్ తెలిపారు. బీఎస్సీ(బీజెడ్సీ), బీఎస్సీ(ఎంపీసీఎస్), బీకాం(సీఏ) గ్రూపుల్లోని సీట్ల భర్తీకి ఈనెల 13 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దోస్త్ వెబ్‌సైట్ ద్వారా విద్యార్థులు తమ దరఖాస్తులను నమోదు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఉచిత హాస్టల్ వసతి, భోజన సదుపాయాలు ఉంటాయని వివరించారు.

మంత్రి కేటీఆర్‌ను కలిసిన నర్సయ్య



మంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న నర్సయ్య

సిరిసిల్లటౌన్: ఇజ్రాయిల్ దేశంలో వ్యవసాయ అధ్యయన పర్యటనకు తనను ఎంపిక చేసినందుకు జిల్లా రైతుబంధు సమితి కోఆర్డినేటర్ గడ్డం నర్సయ్య మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసి మాట్లాడారు. తన స్టడీటూర్ జిల్లా రైతులకు ఎంతో ఉపయోగ పడుతుందన్నారు.

7న విశ్వరూపం మహాసభ



మాట్లాడుతున్న లక్ష్మణ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఏబీసీడీ వర్గీకరణ పోరాటంలో అంతిమంగా విజయం సాధించడానికి ప్రతి మాదిగ బిడ్డ విశ్వరూపం ప్రదర్శించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్ కోరారు. ఎల్లారెడ్డిపేటలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. విశ్వరూపం మహాసభ సన్నాహక సదస్సు ఈనెల 7న వేములవాడలో నిర్వహించనుండగా మందకృష్ణమాదిగ ముఖ్య అతిథిగా వస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని మాదిగ, ఉపకులాలు, నాయకులు, కులబాంధవులు పెద్ద ఎత్తున హాజరై సదస్సును విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం



చెక్ డ్యాం వద్ద క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): బండలింగంపల్లి మానేరు వాగులోని చెక్‌డ్యాం వద్ద సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల చిత్రపటాలకు బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు చీటి లక్ష్మణరావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన చెక్‌డ్యాంలపై అసెంబ్లీలో మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు అజ్ఞానంగా మాట్లాడారని విమర్శించారు. మానేరు నదిపై నిర్మించిన పలు చెక్‌డ్యాంలలో నీరు నిలిచి, భూగర్భ జలాలు పెరిగి రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. చేపల పెంపకంతో మత్స్యకారులు ఉపాధి పొందుతున్నారని పేర్కొన్నారు. ఇవేవీ కాంగ్రెస్ నాయకులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ దూరదృష్టితోనే సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. సీనియర్ నాయకుడు అందె సుభాష్, సింగారం సర్పంచ్ నర్సాగౌడ్, బీఆర్‌ఎస్ ఎల్లారెడ్డిపేట పట్టణాధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి, సింగారం నర్సాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

‘భూములు గుంజుకుంటోంది’

- కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి
- కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ కార్యకర్తలు



కండువాలు కప్పుతున్న మహేందర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో గిరిజనులకు ఇచ్చిన భూములను ఇప్పటి ప్రభుత్వం గుంజుకుంటోందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి ఆరోపించారు. మండలంలోని బుగ్గరాజేశ్వరతండా పరిధిలో శుక్రవారం జెండా గద్దె ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. ఓ వైపు గిరిజనులకు పట్టాలు ఇస్తున్నామంటూనే మరోవైపు భూములు గుంజుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఇందిరమ్మ ఇళ్లు, మహిళా సంఘాలకు వడ్డీమాఫీ చేసిందని, అభయహస్తం పెన్షన్లు కూడా ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అల్మాస్‌పూర్‌కు చెందిన సిరిసిల్ల సురేష్, సిరిసిల్ల దేవయ్యతోపాటు మరో 10 మంది బీజేపీ కార్యకర్తలు పార్టీలో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు.

కాంగ్రెస్ పోరాటంతోనే బీఆర్‌ఎస్ దిగొచ్చింది

కాంగ్రెస్ పార్టీ పోరాటాలతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం దిగొచ్చిందని సిరిసిల్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. రైతుల రుణమాఫీ ప్రకటించినప్పటికీ 2018 సంవత్సరాన్ని కటాఫ్ తేదీగా పెట్టడం సిగ్గుచేటన్నారు. ఇప్పటి వరకు రైతులు చెల్లించిన వడ్డీతో సహా మొత్తం రుణాన్ని మాఫీ చేయాలని కోరారు. ఆర్టీసీ కార్మికుల మాదిరిగానే వీఆర్‌ఏలను కూడా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం కాంగ్రెస్ పోరాటాల ఫలితమేనని స్పష్టం చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు దొమ్మాటి నరసయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, జిల్లా కార్యదర్శి లింగంగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు గణపతి, మోహన్, చెన్ని బాబు, భూమిరెడ్డి, శ్రీనివాస్, లచ్చిరెడ్డి, సోనవేణి రాజయ్య, సత్తయ్య, బాలయ్య, గంట బుచ్చగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలి

- జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్



రైతులకు సూచనలిస్తున్న డీఏవో భాస్కర్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): పత్తి పంటలో ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ అన్నారు. శుక్రవారం తంగళ్లపల్లి మండలంలోని బస్వాపూర్, బాలమల్లుపల్లి గ్రామాల్లో వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ.. పత్తిలో కలుపు తీయించి, యూరియా వేయాలన్నారు. తక్కువ మోతాదులో ఎక్కువసార్లు ఎరువులు వేస్తే మొక్కలు సురక్షితంగా ఉంటాయని చెప్పారు. రసం పీల్చే పురుగుల నివారణకు 1 లీటర్ నీటిలో మోనో 1:4, ఇమిడాక్లోప్రిడ్ 1:20 కలిపి కాండంకు పూయాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో సందీప్, ఏఈవో సంతోష్ పాల్గొన్నారు.

‘డబుల్’ బాధితులకు న్యాయం చేయాలి

- సీపీఎం కార్యదర్శి మూశం రమేశ్



నిరసన తెలుపుతున్న ఇళ్లు రాని పేదలు

సిరిసిల్లటౌన్: డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు రాని అర్హులైన పేదలకు ప్రభుత్వం వెంటనే నివేశన స్థలాలిచ్చి ఇల్లు నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ కోరారు. డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు రాని బాధితులతో శుక్రవారం సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. డబుల్ ఇళ్ల కేటాయింపుల్లో అధికారులు పలుసార్లు విచారణ చేపట్టినా పారదర్శకత లోపించడంతోనే అర్హులకు న్యాయం జరుగలేదన్నారు. ప్రభుత్వం స్పందించి డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు రాని వారికి న్యాయం చేయాలని కోరారు. కోడం రమణ, గోవిందు లక్ష్మణ్, మోర తిరుపతి, సురేష్, లక్ష్మి, మమత, పద్మ, రూప ఉన్నారు.

‘బీసీల ఐక్యతను దెబ్బతీసే ప్రయత్నం’



మాట్లాడుతున్న హన్మాండ్లు

సిరిసిల్లఅర్బన్: జిల్లా కేంద్రంలో యాదవ, గౌడ, ముదిరాజ్, మున్నూరుకాపు సంఘాల భవనాలకు స్థలం కేటాయిస్తామని మంత్రి కేటీఆర్ హామీ ఇవ్వడం హర్షణీయమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు అన్నారు. సిరిసిల్లలోని బీసీ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల ఆత్మగౌరవం పెంపునకు మంత్రి కృషి చేస్తున్నారని తెలిపారు. బీసీల ఐక్యతను దెబ్బతీసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గోవర్దన్‌గౌడ్‌ను కావాలనే తప్పుదోవ పట్టిస్తున్నారని, వారి ప్రవర్తన మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేశ్‌యాదవ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కో–ఆర్డినేటర్ కంచర్ల రవిగౌడ్, నాయకులు కందుకూరి రామాగౌడ్, రాజు, అంజయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లిలో సామాజిక తనిఖీ ప్రజావేదిక

- రూ.36,675 రికవరీ, రూ.10 వేల పెనాల్టీ



వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీపీ పడిగెల మానస అధ్యక్షతన శుక్రవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. తంగళ్లపల్లి మండలంలో 2019 నుంచి 2023 వరకు ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులకు సంబంధించి 30 గ్రామాల నుంచి రూ.36,675 రికవరీ చేసి, రూ.10 వేల పెనాల్టీ వేశారు. రూ.18.46 కోట్ల విలువైన పనులకు గానూ గత జూలై 23 నుంచి గ్రామాలవారీగా తనిఖీలు చేపట్టారు. అనంతరం రెండు విడతల్లో గ్రామ సభలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో గౌతమ్ రెడ్డి, అడిషనల్ డీఆర్డీవో మదన్‌మోహన్, అడిషనల్ ఏపీడీ రామారావు, ఎస్‌ఆర్‌పీ రాఘవులు, ఎంపీడీవోలు లచ్చాలు, చిరంజీవి, ఇన్‌చార్జి ఎంపీవో విజయేందర్ రెడ్డి, ఏపీవో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



సర్టిఫికెట్స్ అందజేస్తున్న చైర్‌పర్సన్ కళ

సిరిసిల్లఅర్బన్: మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా ప్రభుత్వం కృషి చేస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ పేర్కొన్నారు. అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రోజా ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్యూటీ అండ్ కాస్మటాలజీ కోర్స్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. జిందం కళ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి పాటుపడుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, రోజా ఇండస్ట్రీస్ చైర్మన్ సాకా శైలజ, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

భూమి నష్టపోయానని ట్యాంక్ ఎక్కి నిరసన



వాటర్ ట్యాంక్ ఎక్కిన నర్సయ్య

కోనరావుపేట: ఒర్రెను పూడ్చివేయడంతో తాను భూమి నష్టపోయానని ఓ రైతు వాటర్ ట్యాంక్ ఎక్కి, నిరసన తెలిపాడు. బాధితుడి కథనం ప్రకారం.. కోనరావుపేట మండలంలోని పల్లిమక్తకు చెందిన పుట్ట నర్సయ్యకు గ్రామ శివారులోని చెరువు వద్ద 2.10 ఎకరాల భూమి ఉండగా సాగు చేసుకుంటున్నాడు. సమీపంలోని ఒర్రెను గ్రామానికే చెందిన ఉప్పుల దేవయ్య పూడ్చివేశాడు. దీనివల్ల వరద నీరంతా నర్సయ్య భూమిలోకి వచ్చింది. రెండెకరాల్లో మట్టి, ఇసుక పేరుకుపోయింది. తాను భూమి నష్టపోవడానికి కారణం దేవయ్య అంటూ బాధితుడు శుక్రవారం వాటర్ ట్యాంక్ ఎక్కాడు. తనకు న్యాయం చేయకుంటే ఆత్మహత్య చేసుకుంటానని చెప్పాడు. విషయం తెలుసుకున్న ఎస్సై ఆంజనేయులు సంఘటన స్థలానికి చేరుకొని, నర్సయ్యతో మాట్లాడారు. న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో అతను కిందికి వచ్చాడు.

డేంజర్ రోడ్డు

సిరిసిల్ల–కామారెడ్డి వెళ్లే దారిలో వెంకటాపూర్‌లో ప్రధాన రహదారి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కోతకు గురైంది. వెంకటాపూర్ శివారులోని పెట్రోల్‌బంక్ సమీపంలో రోడ్డు పక్కనే భారీ గుంతలు ఏర్పడ్డాయి. వాహనదారులు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల



